

కరీంనగర్ జి ల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

# కరీంనగర్ నుంచే అగ్గి పుట్టాలి

- ఆ అగ్నికీలల్లో కాంగ్రెస్, బీజేపీ కొట్టుకుపోవాలి
- మరోసారి తప్ప చేయద్దు.. గోస పడద్దు
- కరీంనగర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : 'కరీంనగర్‌కు మరోసారి కాబోయే ఎమ్మెల్యే గంగుల కమలాకరే.. ఆయనపై పోటీ చేసేందుకు ఇతర పార్టీల నాయకులు భయపడుతున్నరు. అటొకలు.. ఇటొకలు పారిపోతున్నరు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. బుధవారం కరీంనగర్ జి ల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వా ద సభలో ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న అల్గునూర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్ట్ అయినపుడు అంటుకున్న అగ్గి తెలంగాణ వచ్చే వరకు ఆరలేదని, ఇప్పుడు నవంబర్ 30న మళ్లీ కరీంనగర్‌లో అగ్గి పుట్టాలని, ఆ అగ్నికీలల్లో కాంగ్రెస్, బీజేపీ దహించుకపోవాలని, కొట్టుకుపోవాలని పిలుపునిచ్చారు. ఆయన మాటల్లోనే..

## నీళ్ల కోసం గంగుల పోరాడిండు

తెలంగాణ ఏర్పడిన తొమ్మిదిన్నరేళ్ల కింద నాతో పాటు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌ను ఆశీర్వదించారు. కేసీఆర్ సీఎం అయ్యారు. ఈ తొమ్మినరేండ్లలో తెలంగాణలో ఎన్ని మార్పులు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మీరు మమ్మల్ని ఆశీర్వదిస్తే మరిన్ని మార్పులు తెస్తాం. కరీంనగర్‌లో వచ్చిన మార్పు మీ కండ్ల ముందటనే ఉన్నది. కావాల్సినంత కరెంట్, కడుపునిండా తాగు నీరు, విద్య, వైద్యం అన్ని రంగాల్లో బాగైంది. కరీంనగర్‌లో ఏ ఒక్క లోటు లేదు. ఒకప్పుడు ఎల్ఎండీ నీళ్ల కోసం కమలాకర్ ఎన్నోసార్లు యుద్ధం చేసిండు. మా నీళ్లు మాకే ఉండాలని, గేట్లు బంజేయాలని ఎన్నోసార్లు నీళ్ల కోసం పంచాయితీ పెట్టుకున్నడు. ఇప్పుడు ఆ గోస ఉన్నదా..? ఎక్కడో ఉన్న కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోసి, 618 మీటర్లకు దివి నుంచి భువికి నీళ్లు తీసుకొచ్చిన అపర భగీరథుడు మన కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మిడ్‌మానేరు, అప్పర్ మానేరు, లోయర్ మానేరు నిండుగా మారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒక సజీవ జలధారగా మారిపోయింది. ఎస్సారెస్పీ, వరద కాలువలో 365 రోజులు నీళ్లు ఉంటున్నయి. అప్పర్ మానేరు నుంచి గోదావరి వరకు, ఎక్కడ చూసినా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జలాలతో కళకళలాడుతున్నది.

## నాలుగు మెడికల్ కాలేజీలు తెచ్చాం

ఒక్క మెడికల్ కళాశాల లేని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇప్పుడు నాలుగు మెడికల్ కళాశాలలు వచ్చినయి. మంత్రి గంగుల కమలాకర్ నాయకత్వంలో బలహీన వర్గాల బిడ్డలకు గానీ, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల పిల్లలకు 1,001 గురుకుల పాఠశాలలు ఉన్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ. ఈ ఘనత గంగుల కమలాకర్‌కు కూడా దక్కుతది. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బలహీన వర్గాల సంక్షేమ శాఖను ఆయన అత్యద్భుతంగా నిర్వహిస్తున్నారు.

## ఎంపీగా గెలిచి బండి ఏం చేసిండు?

కరీంనగర్‌లో హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా కలిసి కట్టుగా ఉంటున్నరు. మతం పేరిట చిచ్చు పెట్టే సన్నాసులు ఇదే కరీంనగర్ నుంచి కొంత మంది వచ్చిన్రు. ఆనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కమలాకర్ చేతిలో ఓడిపోయి చావుదెబ్బ తిని, ఆ ఏడుపు, ఆ నటనతో ఏడ్చీ, ఏడ్చీ అమ్మా.. అయ్యా.. అని వినోద్‌కుమార్ మీద ఎంపీగా పోటీ చేసి, హిందూ అని, ముస్లిం అని మనందరినీ మోసం చేసి, లేని పంచాయితీ పెట్టి ఆనాడు ఒకాయన ఇక్కడి నుంచి ఎంపీ అయ్యిండు. ఆయన ఎంపీ అయినప్పటి నుంచి నేటి వరకు ఏం పని చేసింపడ. కరీంనగర్ పట్టణానికి గాని, పార్లమెంట్‌కు గాని ఒక్క పైసా కూడా తేలేదు. ఒక్క కొత్త స్కూల్ తెచ్చిండా..? ఒక్క నవోదయ, ఒక్క కేజీబీవీ పాఠశాల, ఒక ట్రిపుల్ ఐటీ, ఒక మెడికల్ కళాశాలన్నా తెచ్చిండా..? ఒక ఇంజినీరింగ్ కళాశాలన్నా తెచ్చిండా..? బడి తేలేదు. కనీసం గుడి అయినా తెచ్చిండా..? కమలాకరే తిరుమల తిరుపతి దేవస్థానంలో మాట్లాడి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెచ్చిండు.

## వాళ్లకు అధికారం ఇస్తే యాభై ఏండ్లు వెనకకుపోతం

కమలాకర్ అన్న ఒక గొప్ప మాట చెప్పిండు. 1956లో మన తాతలు ముత్తాతలు తప్పు చేశారు. ఆనాడు తెలంగాణ, ఆంధ్రా కలిసేందుకు ఒప్పుకుని తప్పు చేశారు. ఆ తప్పు నుంచి బయట పడేందుకు 58 ఏండ్లు పట్టింది. ఎన్నో రకాలుగా తండ్లాడితే ఆ తప్పుల నుంచి మొన్న మొన్ననే బయటపడ్డం. ఇప్పుడు మరోసారి తప్పు చేసి కాంగ్రెస్‌కో, బీజేపీకో ఓటు వేస్తే మరోసారి యాభై ఏండ్లు వెనుకకు పోతాం. కష్టపడి సాధించుకున్న తెలంగాణ ఆగమైతది. ఖరాబైతది. ఇదే కరీంనగర్‌లో నిరాహారదీక్ష ప్రారంభించి చావు నోట్లో తలపెట్టిన మీ ఆశీర్వాదంతో తెచ్చిన తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపిన కేసీఆర్ ఒకపక్క.. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయమంటే ఆనాడు అమెరికా వెళ్లి దాక్కున్న ఇప్పటి బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇంకో పక్క, ఇంకొకరు ఓటుకు నోటు దొంగ, ₹50 లక్షలు పట్టుకొని కెమెరాల ముందు దొరికి పోయిన థర్డ్ క్లాస్ క్రిమినల్ రేవంత్‌రెడ్డి. వీళ్లతో మనం పోటీ పడాలా..? వాళ్లకు ఓటేసి రాష్ట్రాన్ని వాళ్ల చేతిలో పెడదామా..? తండ్రి లాంటి కేసీఆర్ చేతిలో పెడదామా..? ఒక తప్పు చేసి 58 ఏండ్లు తండ్లాడినం. ఇప్పుడు మరో తప్పు చేసి ఆ పరిస్థితులను పునరావృతం చేసుకోవద్దు. మన అభ్యర్థులు గంగుల కమలాకర్ అయినా, రసమయి బాలకిషన్ అయినా, సుంకె రవిశంకర్ అయినా.. చివరికి నేనైనా.. మీరు వేసే ఓటు మాకే కాదు, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి దోహదపడుతుంది. అదే కాంగ్రెస్‌కో, బీజేపీకో వేస్తే ఢిల్లీకి, గుజరాత్‌కు పోతుంది. వాళ్లకు గులాంగిరి చేసేతానికి మళ్లా తెలంగాణ యాభై ఏండ్లు వెనకకు పోవడానికి కారణం అవుతుంది.

## రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం

గంగుల కమలాకర్ స్వయంగా ఒక ఆలోచన చేసి సీఎం కేసీఆర్‌కు చెప్పిండు. తెలంగాణ అన్నపూర్ణగా మారింది. దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. కానీ, ఇక్కడ ఉండే మన బిడ్డలకు కడుపు నిండా సన్నబియ్యంతో బువ్వ పెడదామని చెప్పగానే అన్నపూర్ణ అనే కొత్త పథకం తీసుకురావాలకున్నం. అన్ని రేషన్ కార్డుల మీద దొడ్డు బియ్యం బదులు నాణ్యమైన సన్న బియ్యం అందిస్తం. కొత్తగా సౌభాగ్యలక్ష్మి అనే పథకం తెస్తున్నం. అర్హులైన ప్రతి మహిళకు నెలకు ₹3 వేలు అందించబోతున్నం. ఆసరా పెన్షన్లు పెరుగుతాయి. రైతు బంధు పెరుగుతది. కేసీఆర్ ఆరోగ్య రక్ష అనే కొత్త కార్యక్రమం కింద ఎవరికి ఏ అవసరమైనా ₹15 లక్షల విలువైన వైద్య సేవలు కుటుంబం మొత్తానికి ఉచితంగా అందించబోతున్నం. ఇన్ని పథకాలు అమలు కావాలంటే కమలాకర్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌ను గెలిపించి శాసన సభకు పంపించి కేసీఆర్‌ను ఆశీర్వదించాలి.

## వాళ్ల వీళ్ల మాటలు విని మోసపోవద్దు

రేపు కరీంనగర్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వస్తున్నారు. ఇంకా ఎవరెవరో వస్తుంటారు.. పోతుంటారు. ఏవేవో మాటలు చెప్తుంటారు. వాళ్ల మాటలు విని యువకులు మోసపోవద్దు. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి తొమ్మిదేండ్లలో 2.20 లక్షల ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టి 1.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మిగతావి కూడా భర్తీ చేస్తాం. జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటిస్తాం. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పూర్తి స్థాయిలో పటిష్టంగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తాం. తిరిగి మరోసారి అవకాశం కల్పించాలని పేరు పేరునా విజ్ఞప్తి చేస్తున్నా.

## పాల్గొన్నది వీరే..

ప్రజా ఆశీర్వాద సభలో మండలి చీఫ్ విప్ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థులు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ వై సునీల్ రావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుర్మాచలం, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపా రాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ ఎమ్మెల్యే కొడూరి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీపీలు పిల్లి శ్రీలత, లక్ష్మయ్య, జడ్పీటీసీ పిట్టల కరుణ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మీలో ఒకడిగా.. మీతోనే ఉన్నా

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : తాను పదిహేనేండ్లుగా ఎమ్మెల్యేగా రాజకీయాల్లో ఉన్నానని, సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. మీ బిడ్డగా మీతోనే ఉన్నానని, మరోసారి మంచి మెజార్టీతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్, కేటీఆర్ మన వెంట ఉన్నారని, రాబోయే రోజుల్లో కరీంనగర్ హైదరాబాద్ తర్వాత ఒక గొప్ప నగరంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నగరంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామని, ఇంకా అనేక పనులు కొనసాగుతున్నాయని, ఈ పనులు పూర్తి చేయాలంటే మరొకరితో సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు తప్పా మళ్లీ మీ మధ్యన ఎప్పుడు కనిపించారని ప్రశ్నించారు. జనం మధ్యకు ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? అని గమనించాలని సూచించారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం రాకముందు కూడా ప్రభుత్వాలు ఉన్నాయని, కరీంనగర్ అభివృద్ధి సమైక్య పాలకులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని మంత్రి గంగుల ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పటి వరకు మచ్చ లేకుండా బతికానని చెప్పారు. ఈ పదిహేనేండ్లలో నగరాన్ని శాంతి యుత వాతావరణంలో ఉంచామని అన్నారు. ఎక్కడైతే హిందువులు, ముస్లింలు కలిసి నడుస్తారో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని భావించి ముందుకెళ్లామన్నారు. అందుకే కరీంనగర్ హైదరాబాద్ తర్వాత ఒక గొప్ప నగరంగా మారిందని స్పష్టం చేశారు. ఈ నగరం, ఈ జిల్లా అభివృద్ధి కొనసాగాలని ఈ విషయాలు చెబుతున్నానని అన్నారు. ఇంకా ఆయన మాటల్లోనే..

**జీవన ప్రమాణాలు పెంచుకున్నం**

నేను మొదటి సారి ఎమ్మెల్యేగా ఉన్నపుడు సమైక్య పాలనలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి వద్దకు వెళ్లి కరీంనగర్‌కు ఒక్క కోటి రూపాయలు ఇవ్వాలని ప్రాధేయపడిన. అయినా ఒక్క రూపాయి ఇవ్వ లేదు. అదే తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి.. కరీంనగర్ అంటే మీకు ఎంతో ఇష్టమని, నగరాభివృద్ధికి నిధులు కావాలని అడిగితే వెంటనే ₹300 కోట్లు ఇచ్చిన ఘనత ఆయనదే. ఇప్పుడు కరీంనగర్‌లో ఎటు చూసినా అద్భుతమైన రోడ్లు కనిపిస్తున్నయి. కరీంనగర్‌కో షాన్ బడాదియా. ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచుకున్నం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అద్భుతమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకున్నం. ఒక వైపు మానేరు రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జ్ మరోవైపు వెంకటేశ్వర ఆలయం, ఈద్గా, కృష్ణుడి ఆలయం, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకున్నాం.

**తప్ప చేయద్దు.. గోస పడద్దు**

రాష్ట్రాన్ని ఢిల్లీ పాలకుల చేతిలో పెడితే నలభైయాభై ఏండ్ల దరిద్రాన్ని చూశాం. ఇప్పుడు ఇతర పార్టీల చేతిలో తెలంగాణను పెడితే మళ్లీ అదే గతి పడుతుంది. మన బిడ్డల భవిష్యత్తు అంధకారం అవుతుంది. తెలంగాణ ఏర్పడితే గుడ్డి దీపం అవుతుందని ఆనాడు చెప్పిన మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, ఇప్పుడు బీజేపీ ముసుగులో వచ్చి హైదరాబాద్‌లో అడ్డా వేసిండు. అపుడు కాంగ్రెస్‌లో ఉండి తెలంగాణను పచ్చిగా వ్యతిరేకించిన వైఎస్ షర్మిల ఇపుడు తెలంగాణ గడ్డ మీద నిలబడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే. ఈ పార్టీలు ఢిల్లీలో కలుసుకుంటాయి. తెలంగాణను వ్యతిరేకించిన ఢిల్లీ పెద్దలంతా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి కూర్చున్నారు. ఎలాగైనా కేసీఆర్‌ను ఓడించి తెలంగాణను ఆంధ్రాలో కలపాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. 1956లో మన తాత ముత్తాలు చేసిన తప్పుకు నలభై యాభై ఏండ్ల దరిద్రాన్ని చూశాం. ఇపుడు మనం ఆ తప్పు చేయద్దు. మన పిల్లల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవాలి.

**ఢిల్లీ చేతులో పెడుదామా..?**
**కేసీఆర్ చేతిలో పెడుదామా..?**

మనం పోరాడి తెచ్చుకున్న తెలంగాణను ఢిల్లీ చేతిలో పెడదామా? హైదారాబాద్‌లో ఉన్న షేర్ కేసీఆర్ చేతిలో పెడదామా? అనేది ఒక్కసారి ఆలోచించాలి. నలభై యాభై ఏండ్లు ఢిల్లీ చేతిలో ఉన్న తె లంగాణను చూశాం. పదేండ్లు కేసీఆర్ చేతిలో ఉన్న తెలంగాణను చూస్తున్నాం. ఎవరిపాలన ఎట్లున్నదో తేల్చుకొని, సరైన నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమైంది. నీళ్లు వచ్చినయి. కరెంట్ వచ్చింది. హైదరాబాద్ సహా రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందుతున్నది. ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూస్తు న్న తరుణంలో అధికారాన్ని ఢిల్లీ పెద్దల చేతిలో పెడితే తిరిగి గదే గుడ్డి దీపం, అస్తవ్యస్థమైన పరిపాలన తప్పదు.

# గంగుల గెలుపు ఖాయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ అభివృద్ధి ఒక్కటే గంగుల కమలాకర్‌ను గెలిపిస్తుందని, ఆయన గెలుపు ఖాయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. చెప్పిన పనులు చేశామని, చెప్పనివి కూడా చేశామని అన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న పార్టీలు, ప్రభుత్వాలు రాష్ట్రానికి ఏం చేశాయో..? తొమ్మిన్నరేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏం చేసిందో..? ప్రజల్లో చర్చ జరుగాలని సూచించారు. పార్టీ పక్షాన వంద ఓటర్లకు ఒక నాయకున్ని ఏర్పాటు చేశామని, ఈ నాయకులు వచ్చే 40 రోజుల్లో ఇంటింటికీ తిరిగి మనం చేసిన అభివృద్ధిని, పరిష్కరించిన సమస్యలను ప్రజలకు విడమర్చి చెప్పాలని సూచించారు. ప్రజల కోసం పాటుపడే పార్టీలు, నాయకులను మాత్రమే ప్రజలు గుర్తుంచుకుంటారని, ఈసారి కూడా బీఆర్ఎస్‌నే ప్రజలు గెలిపించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి కేసీఆర్‌కు ఘన విజయాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కరీంనగర్‌ను లండన్, డల్లాస్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారని, అదే బాటలో ఇప్పుడు ముందుకెళ్తున్నామని అన్నారు. నగరంలో ఎంత పెద్ద వర్షం పడినా, కాలుకు బురద అంటకుండా ఇంటికి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. అందుకు మన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల చేసిన కృషే ఇందుకు కారణమని చెప్పారు. ఒకప్పుడు ఎంపీగా తాను, మంత్రిగా కేటీఆర్ కేంద్రంపై పోరాడి కొన్ని నిధులు తెచ్చామని, అయితే వాటిని సద్వినియోగం చేసి, అభివృద్ధి చేసిన నాయకుడు మాత్రం గంగుల కమలాకర్ అని అన్నారు. మనం కేంద్రంతో ఎంత కొట్లాడినా ఆశించిన నిధులు మాత్రం ఇవ్వలేదని మండిపడ్డారు. కరీంనగర్ అభివృద్ధి మన సొంత ఆలోచనతో, నిధులతో జరుగుతున్నదని అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అని ఆలోచన చేస్తే ఇది ఆచరణ సాధ్యమా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారని, కానీ, దానిని ఆచరణలో పెట్టి చూపుతున్నామని అన్నారు. తెలంగాణ రాకముందు ఒక్క మెడికల్ కళాశాల కూడా సాధించలేని కాంగ్రెస్ నాయకులకు చెంప పెట్టులా ఇపుడు ఉమ్మడి జిల్లాలో నాలుగు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని అన్నారు. కరీంనగర్ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తాను ఎంపీగా ఉన్నపుడు ట్రిబుల్ ఐటీ కోసం ప్రయత్నం చేశానని, దానిని సాధించే క్రమంలో పార్లమెంట్ ఎన్నికలు రావడం, తాను ఓడిపోవడంతో పట్టించుకునే వారు లేకుండా పోయారని అన్నారు. ఇక్కడి నుంచి గెలిచిన ఎంపీ బండి సంజయ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో వాళ్ల పార్టీ అధికారంలో ఉందని, ట్రిబుల్ ఐటీ గురించి ఇప్పటి వరకు ఊసెత్తిన పాపాన పోలేదని అన్నారు. కరీంనగర్‌ను గొప్ప విద్యా కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతీయ రహదారుల గురించి తాను, మంత్రి గంగుల కమలాకర్ ఢిల్లీకి వెళ్లి గొంతు చించుకుని మాట్లాడినా వాటిని పట్టించుకునే నాయకుడు లేడని అన్నారు. మన పార్టీ కేంద్రంలో అధికారంలో లేకున్నా, గొంతెత్తి మాట్లాడి కొన్నింటిని సాధించుకున్నామని అన్నారు.